- గోవర్ధనగిరిధారిగా లక్ష్మీనరసింహుడు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో ఆళ్వార్ దివ్యప్రబంధ అధ్యయన మహోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. అధ్యయనోత్సవాల్లో రెండో రోజు ఆదివారం స్వామివారికి ప్రభాత వేళ తిరుప్పావై మహోత్సవం, నవ కలశాభిషేకం, మూలమంత్ర హోమం నిర్వహించారు. ఉదయం స్వామివారిని వేణుగోపాలస్వామి, సాయంత్రం గోవర్ధనగిరిధారిగా అలంకరించి పురప్పాట్ సేవలను చేపట్టి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

- యాదగిరిగుట్ట

# పుష్కరిణిలో శ్రీవారి చక్రస్నానం

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శాస్త్రోక్తంగా స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి భూవరాహ స్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. శ్రీవారి పుష్కరిణిలో తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 గంటల మధ్య స్నపన తిరుమంజనం, సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చక్రస్నాన సుముహూర్తాన స్వామి పుష్కరిణిలో స్నానమాచరించిన వారికి తిరుమల శేషగిరులలో వెలసి ఉన్న 66 కోట్ల పుణ్యతీర్థ స్నానఫలం దక్కుతుందని పురాణాల ప్రాశస్త్యం. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం శ్రీవేంకటేశ్వరస్వామిని 67,906 మంది భక్తులు దర్శించుకోగా, వారిలో 28,492 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల కానుకల ద్వారా రూ.2.50 కోట్ల హుండీ ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.



ఆదివారం తిరుమల శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



తెలంగాణభవన్‌లో ఇల్లెందుకు చెందిన అన్నపూర్ణను ఓదారుస్తున్న కేటీఆర్

## పట్టించుకోని ప్రజా భవన్.. అండగా నిలిచిన తెలంగాణభవన్

- నాలుగు సార్లు దరఖాస్తులిచ్చినా పట్టించుకోలే
- వందల కిలోమీటర్లు ప్రయాణించి అలిసిపోయా
- అసెంబ్లీ వద్ద రేవంత్ కోసం రోజంతా పడిగాపులు
- చివరికి కేటీఆరే ఆదుకున్నడు: ఇల్లెందు అన్నపూర్ణ

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన మహిళ ఆమె. వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ప్రజా దర్బార్ తలుపుతట్టింది. తనను సర్కారు ఆదుకుంటుందన్న భరోసాతో గోడు వెల్లబోసుకున్నది. ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుల కోసం పడుతున్న కష్టాలు, తన దుర్భరమైన జీవితాన్ని ప్రజాదర్బార్‌లో వివరించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు దరఖాస్తు ఇచ్చినా ఫలితం దక్కలేదు. ఈ ప్రజా దర్బార్ దర్పానికే తప్ప పేదల గోడు పట్టించుకోదని భావించి తెలంగాణభవన్ వైపుచూసింది. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి 'అయ్యా! ఇదీ నా బాధ' అని చెప్పుకున్నది. దీంతో వెంటనే ఆయన ఆర్థిక చేయూత అందించి భరోసా కల్పించారు.

**కేటీఆర్ రూ.1 లక్ష అందించారు..**

'నా పేరు అన్నపూర్ణ. మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని ఆజాద్‌నగర్. ప్రజాదర్బార్‌లో మా కష్టాలు చెప్పుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి హైదరాబాద్ వచ్చా. నేను అనుభవిస్తున్న ఆర్థిక ఇబ్బందులను, పిల్లల చదువుల కోసం పడుతున్న కష్టాలను, నా దుర్భరమైన జీవితాన్ని గురించి ప్రజాదర్బార్‌లో వివరించా. వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ప్రజాదర్బార్‌లో నాలుగు సార్లు దరఖాస్తులు పెట్టుకున్నా ఏ ఒక్కరూ నాపై దయచూపలేదు. అసెంబ్లీ వద్దకు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు రోజంతా పడిగాపులు కాసినా ఎవరూ పట్టించుకోలేదు. చివరికి పోలీసులు అక్కడి నుంచి వెళ్లగొట్టారు. తెలంగాణభవన్‌కు వెళ్లి కేటీఆర్‌ను కలిస్తే మీకు కొంత అండ దొరుకుతుందని ఎవరో చెబితే, ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌కు వెళ్లా. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి నా బాధలు చెప్పుకున్న. నా బాధలు విన్న కేటీఆర్ నా బిడ్డ నర్సింగ్ చదువు కోసం వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందించారు. బంజారాహిల్స్‌లోని తన ఇంటికి పిలుచుకొని మరి నాకు రూ.1 లక్ష చెక్కు అందించారు. నా కూతురు విద్య కోసం, కుటుంబ ఆర్థికసహాయం కోసం సహకారం అందించిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు' అని అన్నపూర్ణ తెలిపారు.

# ఆరు మంత్రి పదవులెవరికో?

- మంత్రివర్గ విస్తరణపై అందరి దృష్టి
- క్యాబినెట్‌లో మరో ఆరు ఖాళీలు
- పోటీలో డజను మందికిపైగా నేతలు
- ఎమ్మెల్యేలతోపాటు ఓడిన వారిలోనూ ఆశలు
- లోక్‌సభ ఎన్నికలలోపే విస్తరణ జరగాలంటున్న నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): శాసనసభ తొలి సమావేశాలు ముగిసిన నేపథ్యంలో అందరి దృష్టి ఇప్పుడు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపైకి మళ్లింది. మంత్రివర్గంలో మరో ఆరుగురికి అవకాశం కల్పించడానికి వీలుండటంతో ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ఇపుడే విస్తరణ చేపడుతారా? లోక్‌సభ ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందా? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, పార్టీ కోసం పనిచేసిన వారంతా ఇప్పుడే పదవుల భర్తీ ప్రక్రియను పూర్తిచేస్తే బాగుంటుందన్న అభిప్రాయంతో ఉన్నారు. నామినేటెడ్ పదవులను కూడా ప్రకటించడంతోపాటు మంత్రివర్గ విస్తరణ చేస్తే రాబోయే లోక్‌సభ ఎన్నికలను, స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడం పార్టీకి తేలిక అవుతుందని చెప్తున్నారు. ఫిబ్రవరి రెండో వారంలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న ఊహాగానాల నేపథ్యంలో పదవుల పంపకంపై చర్చలు జోరందుకున్నాయి. మంత్రివర్గంలో చేరే ఆరుగురు అదృష్టవంతులు ఎవరన్నదానిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. వర్గాలు, కులాలు, ప్రాంతాల సమీకరణపై ఆసక్తికరమైన విశ్లేషణలు కనిపిస్తున్నాయి. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన అవకాశం వచ్చిందని, ఇప్పుడు పదవి రాకపోతే ఇక ఎప్పటికీ రాదన్న ఆలోచనల్లో పలువురు సీనియర్లు ఉన్నట్టు సమాచారం. దీంతో అవకాశం దొరికిన ప్రతీ సందర్భంలో అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

### ఆ నాలుగు జిల్లాల నుంచి ఎవరికి అవకాశం?

పార్టీలో సీనియర్లుగా ఉంటూ పదవులు దక్కని ఎమ్మెల్యేలు ఈసారి విస్తరణలో తమకు ఖాయమని భావిస్తున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. దీంతో ఆ జిల్లాల నుంచి గెలుపొందిన వారు విస్తరణలో తమకు స్థానం ఖాయమన్న భావనతో ఉన్నారు. అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు సీనియర్లు మంత్రివర్గంలో స్థానం కోసం ప్రయత్నిస్తున్నారు. గడ్డం వివేక్, గడ్డం వినోద్ అధిష్ఠానంతో సన్నిహితంగా ఉంటూనే ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డిని కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు. తామిద్దరిలో ఎవరికి మంత్రి పదవి ఇచ్చినా ఫర్వాలేదని చెప్తున్నారు. గతంలో గడ్డం వినోద్ మంత్రిగా చేశారు. ఈ సారి తనకు అవకాశం ఇస్తారని వివేక్ చెప్పుకొంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. వినోద్ కూడా పదవిపై ఆశతోనే ఉన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కూడా తనకు మంత్రి పదవి పక్కా అని తన అనుచరులకు చెప్తున్నట్టు సమాచారం. ఆయనకు అధిష్ఠానం వద్ద కూడా మంచి పట్టున్నది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కూడా మంత్రి వర్గంలో స్థానం లేదా ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిసింది. నిజామాబాద్ జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం ఖాయమన్న ధీమాతో ఉన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కూడా మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ మంత్రివర్గంలో స్థానం ఖాయమని నమ్మకంగా ఉన్నారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చి తనను మంత్రివర్గంలోకి తీసుకొంటారని, ముస్లిం మైనార్టీ కోటాలో తనకు మంత్రి పదవి పక్కా అని చెప్పుకొంటున్నట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా షబ్బీర్ అలీ పట్ల సానుకూలంగా ఉన్నారని సమాచారం.

### హైదరాబాద్ నుంచి అవకాశం ఎవరికో?

కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో ఎవరికి మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తిగా మారింది. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన సీనియర్ నేతలు మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, ఫిరోజ్‌ఖాన్, మైనంపల్లి హన్మంతరావు మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నారు. పార్టీకి కూడా హైదరాబాద్‌ను నడిపించే మంత్రిలేక ఇబ్బందిగా ఉన్నది. పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హన్మంతరావు పేరును కూడా మంత్రివర్గంలో పరిశీలించాలన్న డిమాండ్ ఉన్నది. హన్మంతరావు అంటేనే హైదరాబాద్ కాంగ్రెస్ అన్న పేరున్నది. ఏఐసీసీ వర్గాల్లో కూడా ఆయనకు పట్టున్నది. రంగారెడ్డి నుంచి కూడా మంత్రిగా ఎవరికి అవకాశం ఇస్తారన్న చర్చ జరుగుతున్నది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం ఖాయమన్న ప్రచారం జరుగుతున్నది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మంత్రి పదవి దక్కని పక్షంలో వీరిలో ఇద్దరికి కనీసం కార్పొరేషన్ చైర్మన్ పదవులయినా ఇస్తారని జిల్లా కాంగ్రెస్‌లో ప్రచారం జరుగుతున్నది.

## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- గ్యారెంటీల అమలు కాంగ్రెస్‌కు సాధ్యం కాదు
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, డిసెంబర్ 24: నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు కొత్తగా వచ్చిన ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనవంతుగా ప్రాజెక్టులపై సూచనలు, సలహాలు అందించినట్టు తెలిపారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ప్రొటోకాల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఇప్పట్లో సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలో సృష్టించిన ఆస్తుల మీద స్వేదపత్రం విడుదల చేసిందని, దీని ద్వారా రాష్ట్రానికి ఏం చేసిందో.. ఎంత అభివృద్ధి చేసిందో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వాలు రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం పని చేయాలే తప్ప పట్టుదలకు పోయి చతికిలపడొద్దని సూచించారు. ఏ ప్రభుత్వమైనా హుందాగా వ్యవహరించాలే తప్ప అనవసరమైన ఆరోపణలు చేసి పలుచన కావద్దని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోతుందని కలలో కూడా అనుకోలేదని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండాలని ప్రజలంతా కోరుకున్నారని చెప్పారు. కానీ ఎమ్మెల్యేలు ఓడిపోవడం వల్ల ఫలితం తారుమారైనట్టు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో మాత్రమే కాంగ్రెస్‌కు అనుకూలంగా.. మిగతా జిల్లాల్లో మిశ్రమ ఫలితాలు వచ్చినందున పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడ కూడా బీఆర్‌ఎస్‌కే మంచి ఫలితాలు వస్తాయని జోస్యం చెప్పారు.

## ఎలుక కొరకడంతో శిశువు మృతి

**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘటన**

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎలుక కొరకడంతో నెల రోజుల శిశువు మృతి చెందింది. ఈ విషాద ఘటన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు.. పెద్దకార్పాములకు చెందిన శివతో నాగనూలుకు చెందిన లక్ష్మికి మూడేండ్ల కిందట వివాహం కాగా నెల కిందట బాబు జన్మించాడు. లక్ష్మి నాగనూలులోని పుట్టింటికి వెళ్లింది. అయితే శనివారం ఉదయం ఇంట్లో శిశువు ముక్కును ఎలుక కొరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. గాయాన్ని గుర్తించిన లక్ష్మి వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తీసుకెళ్లింది. గాయం తీవ్రంగా ఉండటం, శిశువు వయస్సు దృష్ట్యా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిలోఫర్‌లో చేర్పించారు. అప్పటికే గాయం తీవ్రంగా ఉండటంతో శిశువు శరీరం చికిత్సకు సహకరించలేదు. చికిత్స నిర్వహిస్తుండగానే ఆదివారం సాయంత్రం మృతి చెందాడు.

- కూచిపూడి లెస్సన్‌కు గిన్నిస్ రికార్డ్





చిన్నారి ఆశ్రితను అభినందిస్తున్న మంత్రి సీతక్క

### 3,883 మంది నృత్య కళాకారుల ప్రదర్శన

శేరిలింగంపల్లి, డిసెంబర్ 24: భారతీయ సంప్రదాయ ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెస్సన్ గిన్నిస్ వరల్డ్ రికార్డులోకి ఎక్కింది. ఏకకాలంలో 3,883 మంది నృత్య కళాకారులు ఆదివారం రాత్రి కూచిపూడి కళావైభవాన్ని ప్రదర్శించారు. దీనికి గచ్చిబౌలిలోని బాలయోగి అథ్లెటిక్ క్రీడాస్టేడియం వేదికైంది. భారత్ ఆర్ట్ అకాడమీ అధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట అతిపెద్ద కూచిపూడి లెస్సన్ ప్రదర్శించారు. స్టేడియంలో పలువైపులా ఏడు నిమిషాల పాటు కళాకారులు సంప్రదాయ దుస్తుల్లో ఏకకాలంలో కూచిపూడి నృత్య సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎక్కారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధి రిషినాథ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. చెన్నైలో 2020 ఫిబ్రవరిలో 1,183 మంది కళాకారులతో ఉన్న కూచిపూడి డ్యాన్స్‌లెస్సన్ రికార్డును ఇప్పుడు బద్దలు కొట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క హాజరయ్యారు. పాఠశాల స్థాయి నుంచే భారతీయ కళలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



బుర్ర వేణు(ఫైల్)


నెల్లికుదురు, డిసెంబర్ 24: పంట చేను వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ సరిచేస్తూ విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో చోటుచేసుకున్నది. నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు బుర్ర వేణు(40)కు మూడెకరాల భూమి ఉన్నది. అందులో పత్తి, మిరప పంటను సాగు చేస్తున్నాడు. ఆదివారం మిరప తోటకు నీళ్లు పెడుదామని వెళ్లాడు. బోరు మోటరు ఆన్ చేసేందుకు స్విచ్ నొక్కినా పనిచేయలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పరీక్షించాడు. ఫ్యూజ్ పోయిందోమోనని అనుమానంతో దాన్ని తీసి పెడుతుండగా విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కే క్రాంతికిరణ్ తెలిపారు.

## వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన కణుజు

**కిలో రూ.800 చొప్పున విక్రయం.. పట్టించుకోని అటవీ శాఖ అధికారులు**

ఖానాపురం, డిసెంబర్ 24: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం చిలుకమ్మనగర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి వేటగాళ్ల ఉచ్చుకు ఓ కణుజు చిక్కింది. దాన్ని చంపి కిలోకు రూ.800 చొప్పున 110 కిలోల మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నట్టు తెలిసింది. కంజు మాంసాన్ని స్థానికంగానే కాకుండా నర్సంపేటతోపాటు ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించినట్టు సమాచారం. ఇదంతా అటవీ అధికారులకు తెలిసినప్పటికీ ఏమీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- 'తాటిపాములవారి' నాలుగు తరాల సమ్మేళనం



ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు తరాలకు చెందిన.. 400 మంది 'తాటిపాముల' ఇంటిపేరు కలిగిన కుటుంబ సభ్యులు ఒక్కచోట కలిశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా శాలపల్లిలో నిర్వహించిన తాటిపాములవారి ఆత్మీయ సమ్మేళనంలో వారందరూ పాల్గొని పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సామూహిక విందును ఆరగించారు. కుటుంబీకుల్లో పెద్దమనుషుల దంపతులను ఘనంగా సత్కరించుకున్నారు. ఇందులో నిర్వాహకులు తాటిపాముల తిరుమల్, రమేశ్, కిషన్, తిరుపతి, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

-పాలకుర్తి

# విధిని జయించిన దివ్యాంగ దంపతులు

- పింఛన్లతో అండగా నిలిచిన కేసీఆర్ ప్రభుత్వం
- రుణ సాయంతో ప్రోత్సహించిన ఎస్సీ కార్పొరేషన్
- చిన్న టీ స్టాల్ నడుపుతూ జీవనోపాధికి బాటలు



ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లోని హోటల్‌లో చాయ్ తయారు చేస్తున్న రాజు

జగిత్యాల, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): అదొక మారుమూల గ్రామం. అక్కడ ఒక పోలియో బాధితుడు. ఆయన భార్య కూడా పుట్టు మూగ. తల్లిదండ్రులు వృద్ధులు. వారికి ఏ ఆధారమూ లేదు. అలాంటి సమయంలో వారికి అండగా నిలిచింది కేసీఆర్ ప్రభుత్వం. ఒకవైపు వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లకు తోడు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేసి వారి జీవితాలకు ఆలంబనగా నిలిచింది. ఆ దివ్యాంగ దంపతులు సాగిస్తున్న జీవనయానం, కష్టాలకు ఎదురొడ్డి నిలిచిన తీరు అందరికీ ఆదర్శనీయం. మాడిశెట్టి రాజుది జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామం. వారిది నిరుపేద కుటుంబం. తండ్రి భూమయ్య వ్యవసాయ కూలి. తల్లి రాజవ్వ బీడీ కార్మికురాలు. వీరు వృద్ధులయ్యారు. రాజుకు పోలియో సోకడంతో దివ్యాంగుడయ్యాడు. చిన్నప్పటి నుంచీ కష్టపడి పనిచేసి బతకాలనే తపన ఉండేది. రాజు గోధూర్ సమీపంలోని బండ లింగాపూర్‌లోని ఒక చిన్న హోటల్‌లో పనికి కుదిరాడు. అక్కడే చాయ్, కాఫీ, టిఫిన్లు తయారుచేయడం నేర్చుకున్నాడు. ఈ నేపథ్యంలోనే మల్లాపూర్ మండలం గొర్రెపల్లికి చెందిన లతను పెండ్లి చేసుకున్నాడు. ఆమె కూడా విధి వంచితురాలే. పుట్టుకతోనే మూగ. మాటలు రావు. చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రి మరో పెండ్లి చేసుకున్నాడు. లత గొర్రెపల్లిలోని అమ్మమ్మ వద్ద పెరిగింది. వారు సైతం నిరుపేదలే కావడంతో రాజుకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. ఈ నేపథ్యంలో 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, సీఎంగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించడం మాడిశెట్టి రాజు దంపతులకు, కుటుంబానికి మేలి మలుపైంది. రాజు తండ్రి భూమయ్యకు వృద్ధాప్య పింఛన్, తల్లి రాజవ్వకు బీడీ పెన్షన్, రాజు, లత దంపతులకు దివ్యాంగ పెన్షన్ మంజూరైంది. దీంతో రాజు కుటుంబ సభ్యులందరికీ కొంత ఆర్థిక సాయం లభించినట్టయ్యింది. రాజు–లత దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కూతురు రిషిక ఇబ్రహీంపట్నం మండలం కస్తూర్బా పాఠశాలలో ఏడో తరగతి, చిన్న కూతురు రిచిత గోధూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుకొంటున్నది. రాజు–లత దంపతులు కేవలం పింఛన్‌పై ఆధారపడకుండా సొంతంగా ఉపాధి చూసుకోవాలని భావించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దివ్యాంగుల కోటాలో రూ.లక్ష రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రుణం మంజూరు చేస్తే టీస్టాల్ పెట్టుకుంటానని తెలియజేశాడు. రాజు పట్టుదలను చూసిన కార్పొరేషన్ 80% సబ్సిడీతో రూ.లక్ష రుణం మంజూరు చేసింది. దీంతో రాజు–లత దంపతులు గోధూర్‌లో చిన్న టీస్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు.

### కేసీఆర్ సర్కారుతోనే బతుకుదెరువు దొరికింది

కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయం వల్లే మేం ఈరోజు ఆనందంగా ఉన్నాం. నాపట్ల దేవుడు చిన్నచూపు చూశాడు. అయినా, నేను కుంగిపోలేదు. నేను, నా భార్య ఇద్దరం కలిసి కష్టపడి బతికేందుకే ప్రయత్నించాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత మా కుటుంబ సభ్యులందరికీ కలిపి తొలుత నెలకు రూ.5 వేలు, ఆ తర్వాత రూ.12 వేలకుపైగా పెన్షన్ రావడంతో ఇబ్బందులు పోయాయి. కేవలం పెన్షన్‌పై ఆధారపడి బతకడం మంచిది కాదని ఎస్సీ కార్పొరేషన్ సాయంతో చాయ్ హోటల్ పెట్టుకొని బతుకుతున్నం. అన్ని ఖర్చులు పోను నెలకు నాలుగైదువేలు మిగులుతున్నాయి. నా బిడ్డలను సర్కార్ బడిలో చదివిపిస్తున్నా. కొంచెం పెద్ద మొత్తంలో రుణం లేదా సాయం అందితే టిఫిన్ సెంటర్ పెట్టి, మరో ఇద్దరు ముగ్గురికి ఉపాధి చూపించాలని ఉన్నది. మాది చిన్న పెంకుటిల్లు. తల్లిదండ్రులు అందులోనే ఉంటున్నరు. వారి కోసం ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నా.

*- మాడిశెట్టి రాజు, దివ్యాంగుడు, గోధూర్, ఇబ్రహీంపట్నం మండలం, జగిత్యాల జిల్లా*